సాక్షి మంచిర్యాల

బుధవారం ׀ 14 ׀ జూన్ ׀ 2023



రక్తం ఇద్దాం.. ప్రాణం పోద్దాం

రక్తం మానవ శరీరానికి ప్రాణవాయువు లాంటిది. దాతలు ఉంటేనే అత్యవసర పరిస్థితుల్లో మరొకరి ప్రాణం కాపాడవచ్చు. నేడు రక్తదాన దినోత్సవం. 8లో ▸



త్వరలో 'గుర్తింపు' ఎన్నికలు

సింగరేణిలో 7వ గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ ఈనెల 24న విడుదల కానుంది. కార్మిక సంఘాలు, యాజమాన్యం మధ్య సమావేశం జరిగింది. 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 42.4 /31.5

ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉదయం నుంచే వేడిగా ఉంటుంది. మధ్యాహ్నం వేడి. ఉక్కపోత అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి కూడా వేడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

16న సైన్స్ హాకథాన్‌పై అవగాహన

మంచిర్యాలఅర్బన్: సైన్స్ హాకథాన్‌పై పూర్తి అవగాహన కల్పించేందుకు టీశాట్ చానల్ ద్వారా ఈనెల 16న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. జిల్లాలోని 8 నుంచి 10వ తరగతి విద్యార్థులు భౌతిక రసాయనశాస్త్ర, జీవశాస్త్ర, గణిత ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేవీకే శాస్త్రవేత్తకు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న శాస్త్రవేత్త స్రవంతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ యు.స్రవంతి ఉత్తమ యువ శాస్త్రవేత్త జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. కేవీకే ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు ప్రదానోత్సవం జరిగింది. నిర్వాహక సంస్థ పంపించిన అవార్డును కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.రాజేశ్వర్‌నాయక్ ప్రదానం చేశారు. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌కు చెందిన గ్లిసియర్ జనరల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేషనల్ అవార్డ్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ-2023 గ్లోబల్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ పోటీలు నిర్వహించింది. ఈపోటీల్లో శాస్త్రవేత్త స్రవంతి టీచింగ్, రీసెర్చ్, పబ్లికేషన్స్ విభాగాల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయిలో ఉత్తమ యువ శాస్త్రవేత్త అవార్డుకు ఎంపికయ్యారు. జాతీయ అవార్డు అందుకున్న స్రవంతిని సహచర శాస్త్రవేత్తలు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శివకృష్ణ, నాగరాజు, సతీశ్, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న మోతె రాజలింగు

పాతమంచిర్యాల: బీఆర్‌ఎస్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోతే రాజలింగు అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీసీలకు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కులవృత్తులు చేసుకునే వారికి ప్రభుత్వం లక్ష రూపాయలు ఇస్తామని ప్రకటించిందని, బీసీల జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలన్నారు. బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి బీసీ కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు, ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు, సంచార జాతుల ఫెడరేషన్‌కు రూ.1000 కోట్లు ప్రతీ కుల ఫెడరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయించాలని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్, బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సీఐల బదిలీ

తాండూర్/శ్రీరాంపూర్: జిల్లాలో ఇద్దరు సీఐలు బదిలీ అయ్యారు. తాండూర్ సీఐ కె.జగదీష్‌ను పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సీఐడీ విభాగంలో పనిచేస్తున్న సతీశ్‌కుమార్‌ను నియమించారు. శ్రీరాంపూర్ సర్కిల్ సీఐ రాజును ఐజీకి అటాచ్ చేశారు. ఆయన స్థానంలో రామగుండం లీగల్ సెల్‌లో ఉన్న ఎంఎల్‌ఎం.లింగయ్యను నియమించారు. ఈమేరకు మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.



అధికారులకు లంచాల జబ్బు!

- అవినీతికి మరిగిన కొందరు ఆఫీసర్లు
- పని చేయాలంటే చేతులు తడపాల్సిందే..
- తాజాగా ఏసీబీకి చిక్కిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో కొందరు అధికారులకు అవినీతి జబ్బు పట్టింది. ప్రభుత్వం ఇస్తున్న జీతం తీసుకుంటూనే, లంచాల కోసం ఎగబడుతున్నారు. ఈ ఏడాది నాలుగు నెలల వ్యవధిలోనే నలుగురు అధికారులు ఏసీబీకి పట్టుబడడం జిల్లాలో మితిమీరుతున్న అవినీతికి అద్దం పడుతోంది. తాజాగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ముగ్గురు అధికారులు ఏసీబీకి చిక్కారు. బెల్లంపల్లికి చెందిన డి.రాంసాగర్ సోదరి కారు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోకు నెలవారీ అద్దె ప్రతిపాదికన నడుస్తోంది. ఆరు నెలల అద్దె రూ.1.96 లక్షలు చెల్లించేందుకు అప్పటి సీనియర్ అసిస్టెంట్ షఫియొద్దీన్ రూ.10 వేలు లంచం డిమాండ్ చేశాడు. ఇటీవలే ఆయన రామగుండం మెడికల్ కళాశాలకు బదిలీపై వెళ్లాడు. అయినా రాంసాగర్‌ను డబ్బుల కోసం ఫోన్‌చేసి డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. లంచం డిమాండ్ చేసిన షఫియొద్దీన్, ఆయనకు డబ్బులు చేరవేయడంలో సహకరించిన అకౌంటెంట్ దీపిక, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాజనర్సయ్యను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఫిబ్రవరి 27న మంచిర్యాల వ్యవసాయ మార్కెట్‌కమిటీ స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ శారద, గద్దెరాగడికి చెందిన పత్తి వ్యాపారి విశ్వేశ్వర్ నుంచి రూ.65 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికింది. పత్తి కొనుగోలు లైసెన్సు జారీ రిపోర్టు కోసం రూ.లక్ష డిమాండ్ చేసి, చివరకు రూ.80 వేలు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చింది. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించి, ఆమెను జైలుకు పంపాడు. గతంలోనూ జిల్లాలోని అధికారులు ఏసీబీకి పట్టుబడిన ఘటనలు ఉన్నాయి.

మారని అవినీతి అధికారుల తీరు..

జిల్లాలో ఇప్పటికీ చాలా శాఖల్లో లంచం ఇవ్వనిదే పని కావడం లేదు. సబ్ రిజిస్ట్రార్, రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్, సింగరేణి, పంచాయతీరాజ్, సంక్షేమ శాఖ, విద్య, వైద్యం, ట్రెజరీ, పౌరసరఫరాల శాఖ, ఠాణాల్లో సైతం పైసలు ముట్టజెప్పందే ఫైలు కదలడం లేదు. దీంతో చాలా చోట్ల బాధితులు తమ పని కోసం ఎంతో కొంత ముట్టజెబుతున్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలో, పౌరులకు సేవలు అందించడంలోనూ కొందరు అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా స్థాయి ఉద్యోగ నియామకాలు, ఔట్‌సోర్సింగ్ సేవలు, భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించడం తదితర పనులకూ అధికారులు బాధితుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. చాలాచోట్ల ఏసీబీ వరకు ఫిర్యాదులు వెళ్లకపోవడంతో అధికారుల్లో మార్పు రావడం లేదు.

ఏసీబీకి పట్టిస్తున్నారు

- 2021, జూలైలో బెల్లంపల్లి పట్టణ టౌన్ ఎస్సై, ఆయన డ్రైవర్ స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఓ బాధితుడి నుంచి రూ.1.20 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు.
- 2019లో జన్నారం మండల రెవెన్యూ శాఖలో సర్వేయర్ ఓ రైతు నుంచి రూ.3 వేలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.
- 2017లో ఓ మండలస్థాయి అధికారి కాంట్రాక్టరు నుంచి బిల్లుల్లో పర్సంటేజీ డిమాండ్ చేసి రూ.16 వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు.
- 2017లో ప్రభుత్వ భూముల్ని ప్రైవేటు వ్యక్తుల నుంచి డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్లు చేస్తున్న మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులపై కేసు నమోదు చేశారు.
- 2016లో మందమర్రి మండలం అందుగులపేట వీఆర్వో పట్టాపాస్ పుస్తకం జారీకి సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి నుంచి డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.
- 2015లో ఇద్దరు సాగు నీటి పారుదల అధికారులు మిషన్ కాకతీయ కాంట్రాక్టర్ నుంచి డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.

లంచం అడిగితే ఫోన్ చేయండి
ఏసీబీ డీఎస్పీ: 9154388954

మహిళా సంక్షేమానికి పెద్దపీట



బతుకమ్మలతో ఊరేగింపుగా వస్తున్న అంగన్‌వాడీ టీచర్లతో కలెక్టర్ బదావత్ సంతోష్

- తొమ్మిదేళ్లలో అనేక సంక్షేమ పథకాలు
- కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలటౌన్: తెలంగాణలో మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి అంగన్‌వాడీ టీచర్లు బతుకమ్మలతో ర్యాలీగా వచ్చారు. కలెక్టర్ జెండాఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో మహిళల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కిశోర బాలికలకు, గర్భిణులకు పౌష్టికాహారం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, కేసీఆర్ కిట్, న్యూట్రీషియన్ కిట్‌లు, ఆరోగ్యలక్ష్మి, ఒంటరి మహిళలు, వితంతువులకు ఆసరా పెన్షన్లు, ఆరోగ్య మహిళా కేంద్రాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు, షీటీం ద్వారా మహిళలకు రక్షణ, సఖి కేంద్రం ద్వారా భరోసా వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. మహిళల ఆత్మగౌరవం, భద్రత, ఆర్థిక స్వావలంబన, మహిళా ఉద్యోగుల కోసం చేస్తున్న కృషిలో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల వేతనం రూ.4,200 నుంచి రూ.13,250కి, మినీ అంగన్‌వాడీ టీచర్ల వేతనం రూ.2,200 నుంచి రూ.7,800లకు, ఆశ వర్కర్లకు రూ.1,500 నుంచి రూ.9,750కు పెంచినట్లు వివరించారు. మహిళా సాధికారత కోసం మోటార్ డ్రైవింగ్ శిక్షణ, 35 శాతం రాయితీతో షీ ట్యాక్సీ పథకం అమలు చేస్తున్నారని, బాలికల విద్య కోసం కస్తూరిబా బాలికల విద్యాలయాలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. మాతా శిశు మరణాలను 92 నుంచి 43 శాతానికి తగ్గించామని, 39 శాతం ఉన్న శిశు మరణాల రేటు 21 శాతానికి తగ్గించామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని సన్మానించారు. దివ్యాంగుల్లో ఐదుగురికి రూ.50 వేల రాయితీతో రుణాలు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు వస్త్ర దుకాణాల ఏర్పాటుకు రుణాలు అందించారు. ఆరుగురికి గొర్రెల కొనుగోలు కోసం రుణాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పన, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేశ్, ఆర్డీవో వేణు, షీటీం ఎస్సై ఓబులమ్మ, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాన్స్‌జెండర్లకు రుణాల చెక్కు అందిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్‌రావు



ఉత్తమ సేవలు అందించిన అంగన్‌వాడీ టీచర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

లక్ష్యాన్ని సాధించే వరకు శ్రమించాలి

- అదనపు కలెక్టర్ బి.రాహుల్



విద్యార్థినికి అడ్మిషన్ పత్రం అందిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

నస్పూర్: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించే వరకూ శ్రమించాలని అదనపు కలెక్టర్ బి.రాహుల్ సూచించారు. సమీకృత కలెక్టరేట్‌లో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభ ప్రోత్సాహక పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులకు హైదరాబాద్‌లోని కార్పొరేట్ కళాశాలలో అడ్మిషన్ పత్రాలను ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి, డీఈవో ఎస్.యాదయ్యతో కలిసి అందించారు. అడ్మిషన్ సాధించిన విద్యార్థులకు అన్ని వసతులతో రెండేళ్లు ఉచిత విద్యతోపాటు ఐఐటీ కోర్సులలో పూర్తిగా ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. అడ్మిషన్లు పొందిన వారిలో కన్నెపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని పి.వైష్ణవి, రేచిని జెడ్పీహెచ్‌ఎస్ విదార్థిని ఈ.ఈశ్వరి, పొన్నారం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని బి.రష్మిత ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, సెక్టోరియల్ అధికారులు పి.శ్రీనివాస్, కె.చౌదరి, ఏ సత్యనారాయణమూర్తి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రంగంపేట్ స్కూల్ భవనానికి మోక్షం



కూలిన రంగపేట్ పాఠశాల భవనం (ఫైల్)



పిచ్చిమొక్కల మధ్య పాఠశాల భవనం

- రూ.20లక్షలు మంజూరు

మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాలలోని రంగంపేట్ పాఠశాలల భవన నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు(డీఎంఎఫ్‌టీ) కింద రూ.20 లక్షలు మంజూరయ్యాయి. మున్సిపాలిటీ టెండర్లు ఖరారు చేస్తే పనులు చేపట్టనున్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహించే రంగంపేట్ పాఠశాలలో 25 మంది విద్యార్థులు అభ్యసించేవారు. 2020లో కురిసిన వర్షాలకు జూన్ 15న పాఠశాల ముందు(వరండ) భాగం పైకప్పు(స్లాబ్) కూలింది. శిథిలభవనంలో విద్యార్థుల ఇబ్బందులపై పలుమార్లు 'సాక్షి'లో కథనం ప్రచురించాం. 2022-23 విద్యా సంవత్సరంలో పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోకి మార్చారు. పాఠశాల దూరభారం కావడంతోపాటు విద్యార్థులకు ఆర్థిక భారంగా మారింది. ప్రస్తుతం 25 మంది పాఠశాలలో చదువుతున్నారు. పాఠశాల దూరం కావటంతో విద్యార్థులు ఆటోల్లో రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పాఠశాల నూతన భవనంపై స్థానిక కౌన్సిలర్ బోలిశెట్టి సునీత ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. డీఎంఎఫ్‌టీ కింద రూ.20 లక్షలు మంజూరు చేయించారు.

సీఆర్పీల ఉద్యమబాట!

- పదేళ్ల క్రితం విధుల్లో చేరిన సమగ్ర శిక్ష క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు
- సర్వీసు క్రమబద్ధీకరించకపోవడంతో ఉద్యోగ భద్రత కరువు
- చాలీచాలని వేతనాలు, అదనపు పనిభారంతో అవస్థలు
- నేడు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు పిలుపు



లింగాపూర్‌లో బడిబయట పిల్లల సర్వే చేస్తున్న సీఆర్పీ (ఫైల్)

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	కాంప్లెక్స్‌లు	సీఆర్‌పీలు
ఆదిలాబాద్	62	59
కుమురంభీం	67	56
మంచిర్యాల	52	43
నిర్మల్	51	45

ఏళ్లుగా నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తున్నా తగిన గుర్తింపు రావడం లేదని భావించిన సీఆర్పీలు ఉద్యమబాట పట్టారు. తమ సమస్యల పరిష్కారంపై సర్కారు దృష్టి సారించకపోవడంతో ఆందోళనలకు సిద్ధమయ్యారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బుధవారం నిర్వహించే ధర్నాకు ఉమ్మడి జిల్లా నుంచి తరలివెళ్లారు.

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం నూతన విద్యావిధానాలు అమలు చేస్తోంది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో కీలకమైన విధులు నిర్వర్తిస్తున్న సీఆర్పీ(క్లస్టర్ రిసోర్స్ పర్సన్)ల సమస్యలను పట్టించుకోవడం లేదు. పదేళ్లుగా విధుల్లో ఉన్నా ఉద్యోగ భద్రత లేకపోవడం వారిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కొత్త నియామకాలు లేకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై తీవ్ర పనిభారం పడుతోంది. ఉపాధ్యాయ ఎన్నికల సమయంలో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి ప్రకటన మేరకు న్యాయం జరుగుతుందని ఎదురుచూసిన వారికి నిరాశే ఎదురైంది. 2021 జూన్ నుంచి పెంచిన వేతనాలు అమలు చేస్తున్నా సమాన పనికి సమాన వేతనం మాత్రం వారికి అందని ద్రాక్షగానే మిగిలింది.

ఉమ్మడి జిల్లాలో 203 మంది..

జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులకు వారధి ఉంటూ.. పాఠశాలలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు అనుసంధానంగా పనిచేసేందుకు వీలుగా సీఆర్పీలను ప్రభుత్వం నియమించింది. పదేళ్ల క్రితం రాత పరీక్షల ద్వారా ప్రతీ మండలానికి ముగ్గురు చొప్పున ఎంపిక చేసి ఎమ్మార్సీ కార్యాలయ పనులు, పాఠశాలల పర్యవేక్షణ పనులు అప్పగించారు. అయితే ఉపాధ్యాయులు కార్యాలయాల్లో పనిచేస్తే విద్యార్థులు నష్టపోతారనే ఉద్దేశంతో విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులను అత్యవసర పరిస్థితులు, ఎన్నికల విధులు, జనాభా లెక్కల విధులకు మాత్రమే వినియోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో 2011లో నూతన విధానం తీసుకువచ్చారు. దీనికి అనుగుణంగా టీటీసీ, బీఈడీ విద్యార్హతతో 2012లో రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి సర్వ శిక్ష కార్యక్రమం కింద కాంట్రాక్ట్ పద్ధతిలో ఒక్కో కాంప్లెక్స్ పరిధిలో ఒక్కో సీఆర్పీని నియమించారు. ఇందులో కొంత మంది వ్యక్తిగత కారణాలతో ఉద్యోగాలు వదిలిపెట్టారు. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 232 కాంప్లెక్స్‌లకు 203 మంది సీఆర్పీలు విధులు నిర్వర్తిస్తున్నారు.

18కి పైగా విధులు

ప్రస్తుతం సీఆర్పీలు క్షేత్రస్థాయిలో 18కి పైగా విధులు నిర్వర్తిస్తున్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సహాయంగా ఉంటూనే బడిబయట పిల్లల గుర్తింపు, 18 నుంచి 25 పాఠశాలల పర్యవేక్షణ, ఎస్‌ఎంసీ సమావేశాల నిర్వహణ, కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణ, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విధులు, మధ్యాహ్న భోజన అమలు పరిశీలన, సమగ్ర శిక్ష కార్యక్రమాల నిర్వహణ, ఎమ్మార్సీ కార్యాలయం, పాఠశాలల మధ్య అనుసంధాన కర్త, విద్యార్థుల ఆధార్ నమోదు, ఎన్నికల విధులు, యూడైస్, చైల్డ్ ఇన్ఫోలో వివరాల నమోదు తదితర పనులు చేయాలి. వీటితోపాటు జిల్లాస్థాయి అధికారులు ఆదేశాల మేరకు పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఇటీవల స్వచ్ఛ విద్యా పురస్కార్‌కు సంబంధించి ఫొటోలు తీసుకోవడం, ఉపాధ్యాయుల డేటా అప్‌డేట్ చేయడం వంటి బాధ్యతలను కూడా వీరికే అప్పగించారు.

ప్రధాన డిమాండ్లు

- సీఆర్పీలను క్రమబద్ధీకరించాలి.
- వేతనంగా రూ.42,300 చెల్లించాలి.
- ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలి.
- హెల్త్ కార్డులు అందించాలి.
- మరణించిన సీఆర్పీ కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.

ఉద్యోగ భద్రత లేక..

చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి పనికి తగిన వేతనం చెల్లించాలని సీఆర్పీలు డిమాండ్ చేస్తున్నారు. జాబ్‌చార్ట్ ప్రకారం వీరు 15 నుంచి 18 పాఠశాలలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే సిబ్బంది కొరతతో 18 నుంచి 25 స్కూళ్ల బాధ్యతలు అప్పగించారు. ఖాళీలను భర్తీచేసి పనిభారం తగ్గించాలని కోరుతున్నారు. ప్రస్తుతం వీరికి కేంద్ర ప్రభుత్వం 60, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భాగస్వామ్యంతో వేతనాలు చెల్లిస్తున్నారు. అంతకు ముందు వీరికి రూ.15వేలు చెల్లించగా, 2021 నుంచి 30 శాతం పెంచారు. దీని ప్రకారం రూ.19,500 అందాల్సి ఉన్నా రూ.150 కోత విధించారు.

రెగ్యులర్ చేయాలి



పదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అర్హతలు ఉన్నా ఉద్యోగ భద్రత కల్పించడం లేదు. వెంటనే సీఆర్పీలను రెగ్యులర్ చేయాలి. అప్పటివరకు స్కూల్ అసిస్టెంట్ స్థాయిలో పేస్కేల్ అమలు చేయాలి. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమానికి అందరూ తరలిరావాలి.

– పవన్ కుమార్, సీఆర్పీల సంఘం కుమురంభీం జిల్లా అధ్యక్షుడు

గ్రూప్-4 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జులై 1న గ్రూప్-4 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి అదనపు కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఇన్విజిలేటర్లను నియమించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రశ్నపత్రాల భద్రత, తరలింపు ప్రక్రియపై పోలీసు శాఖ అధికారుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. అదనపుకలెక్టర్ మధుసూదన్‌నాయక్ మాట్లాడుతూ జిల్లాలో 94 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 27,803 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సి విభాగం పర్యవేక్షకులు సంతోష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి

క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

బెజ్జూర్(సిర్పూర్): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కృష్ణపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నికాడి ఇస్తారి (27) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై పంట పొలంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య బక్కు బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

ఉరేసుకుని సింగరేణి కార్మికుడు బలవన్మరణం

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని మొదటి జోన్‌కు చెందిన సింగరేణి కార్మికుడు జడ తిరుపతి (36) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఆర్కే–7గనిలో విధులు నిర్వహిస్తున్న తిరుపతి కుటుంబ సభ్యులతో కలిసి క్రిష్ణకాలనీలో ఉంటున్నాడు. మానసిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఇది వరకే పలుమార్లు ఆత్మహత్యకు యత్నించాడు. 20 రోజులుగా విధులకు వెళ్లకుండా మద్యం మత్తులో ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం మద్యం సేవించి ఇంటికి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఈద్గా కాలనీలో చోరీ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఈద్గాకాలనీలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. కాలనీకి చెందిన ఆనందరావు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బెల్లంపల్లిలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటి తాళం పగులగొట్టిన దుండగులు బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. మంగళవారం ఇంటికి వచ్చిన ఆనందరావు చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రేషన్ డీలర్ మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బెల్లంపల్లి జక్కాగౌడ్ (57) అనే రేషన్ డీలర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బావురావుపేట గ్రామానికి చెందిన జక్కాగౌడ్ సోమవారం రాత్రి బైక్‌పై చెన్నూర్‌కు వెళ్లి వస్తుండగా టోల్ ప్లాజా మంచిర్యాల నుంచి చెన్నూర్ వైపు అతివేగంగా వెళ్తున్న టెంపో ట్రాక్స్ వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లక్కపేటలోని చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సౌజన్య తెలిపారు.

కలప పట్టివేత

ఆసిఫాబాద్‌రూరల్: అక్రమంగా కారులో తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి డోరి గనుల ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కారులో కలపతో వస్తున్న డ్రైవర్, బైక్‌పై వస్తున్న వ్యక్తులు అధికారులను గమనించి వాహనాలను అక్కడే వదిలి పారిపోయారు. వాహనాలను స్వాధీనం చేసుకుని కలప దుంగలను రేంజ్ కార్యాలయానికి తరలించారు. వాటి విలువ రూ.27,904 ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్, బీట్ అధికారులు విజయ్ కుమార్, స్వప్న, ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తం ఇద్దాం.. ప్రాణం పోద్దాం..



రక్తం మానవ శరీరానికి ప్రాణవాయువు లాంటిది. జీవన విధానం, పౌష్టికాహార లోపం, వ్యాధి నిరోధక శక్తి మందగించడం, ప్రమాదాల్లో గాయపడి రక్తస్రావం జరిగినప్పుడు రక్తం కొరత ఏర్పడుతుంది. ఆ లోటును పూడ్చేందుకు ఒకే ఒక్క అవకాశం రక్తం ఎక్కించడం. రక్తదాతలు ఉంటేనే అత్యవసర పరిస్థితుల్లో మరొకరి ప్రాణం కాపాడవచ్చు. రక్తం ప్రాధాన్యం తెలిపేందుకు, రక్తదానంపై అవగాహన పెంచడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా జూన్ 14న రక్తదాతల దినోత్సవం నిర్వహిస్తోంది. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కథనం.

- అన్నిదానాలకన్నా గొప్పది రక్తదానం
- ఆపదలో ప్రాణాలు కాపాడుతున్న దాతలు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం


కౌటాలలో రక్తదానం చేస్తున్న దాత (ఫైల్)


కౌటాల(సిర్పూర్): చాలాకాలంగా రోజురోజుకూ రక్తం లభ్యత అనేది పెనుభూతంలా మారుతున్న సామాజిక సమస్యగా పరిణమిస్తోంది. రోడ్డు ప్రమాదాలు, క్యాన్సర్, తలసేమియా చికిత్సలు, ప్రసవ సమయం.. ఇలా పలు అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం మరింత ఎక్కువగా ఉంటుంది. దశాబ్ద కాలంగా రక్తదానం గురించి అవగాహన పెరిగినప్పటికీ సరిపడా రక్తనిల్వలు ఉండడం లేదు. ఆరోగ్యకరమైన వ్యక్తి స్వచ్ఛందంగా రక్తదాతగా మారడం మాత్రమే దీనికి పరిష్కారం. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు జిల్లాకు చెందిన యువకులు.

రక్తాన్ని తయారు చేయలేం..

ప్రతీ మూడుసెకన్లకు ఒకరు రక్తం కొరతతో మరణిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. సాంకేతికత ఎంత పెరిగినా ఒకరి నుంచి మరొకరికి అందించడం తప్ప రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమనేది నిజం. కానీ రక్తదానంపై ఇంకా ప్రజల్లో పలు సందేహాలున్నాయి. అవన్నీ అపోహలేనని, 18 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, 50 కేజీల కన్నా ఎక్కువ బరువున్న ఆరోగ్యకరమైన ప్రతీవ్యక్తి నిస్సందేహంగా రక్తదానం చేయవచ్చని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ప్రతీ మూడునెలలకు ఒకసారి రక్తదానం, 15 రోజులకు ఒకసారి ప్లేట్‌లెట్స్ దానం చేయవచ్చని, రక్తదానంతో రోగనిరోధకశక్తి పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

ఒక్కరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణం..!

ఒక వ్యక్తి దానం చేసే రక్తం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందని డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. రక్తం ఇవ్వగానే దాన్ని వివిధ కాంపోనెంట్లుగా విభజిస్తారు. దాత నుంచి సేకరించే రక్తాన్ని హోల్‌బ్లడ్ అంటారు. ఆ రక్తంలో ప్లాస్మా, ప్లేట్‌లెట్స్, తెల్ల రక్తకణాలు, ఎర్ర రక్తకణాలు కలిసిన ద్రవంలాంటివి ఉంటాయి. ఒక హోల్‌బ్లడ్‌ను కనీసం మూడు రకాల కాంపోనెంట్లుగా విడదీస్తారు. అది ముగ్గురి ప్రాణాలను కాపాడుతుంది. దీనిని మరిన్ని కాంపోనెంట్లుగా విడదీసే అవకాశం ఉంటే మరికొందరి ప్రాణాలు కాపాడవచ్చు.



రక్తం కొరత ఉంది



జిల్లాలో రక్తం నిల్వ కొరత తీవ్రంగా ఉంది. 18 ఏళ్లు నిండి ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ రక్తదానం చేయవచ్చు. రక్తదాతల కోసం జిల్లా కేంద్రంలో రక్త సేకరణ కేంద్రం ఏర్పాటు చేశాం. కాగజ్‌నగర్ కేంద్రంలో రక్తం నిల్వ ఉంచి అత్యవసరం ఉన్న వారికి అందిస్తాం. స్వచ్ఛంద సంస్థలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తే వైద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తాం. – రామకృష్ణ, జిల్లా వైద్యాశాఖ అధికారి, ఆసిఫాబాద్

33 సార్లు రక్తదానం చేశా



ఇప్పటి వరకు నేను 33 సార్లు రక్తదానం చేశా. రక్తదానం చేయడంతో ఆరోగ్యంగా ఉంటాం. అత్యవసరంలో ఉన్న వారికి రక్తదానం చేస్తా. రక్తదానం చేస్తే అనారోగ్యం పాలవుతామనేది అపోహ మాత్రమే. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి. – వైరాగరే ప్రతాప్‌కుమార్, ఆసిఫాబాద్

యువత ముందుకు రావాలి



ఇప్పటి వరకు 27 సార్లు రక్తదానం చేశా. నేను ఆస్పత్రిలో పనిచేసే సమయంలో చాలా మంది నిరుపేద రోగులు రక్తం కోసం పడిన ఇబ్బందులు చూశా. సమయానికి రక్తం దొరకక చాలామంది ప్రాణాలు సైతం కోల్పోయిన ఘటనలు నన్ను కలిచి వేశాయి. యువత రక్తదానానికి ముందుకు రావాలి. – రాధాకృష్ణ, భట్టుపల్లి, కాగజ్‌నగర్

ఆదర్శం.. సింగరేణి యువ కార్మికులు

- ఇప్పటి వరకు 2,277 మంది రక్తదానం
- గవర్నర్ నుంచి ప్రశంసలు
- వీటీసీలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో సింగరేణి యువ కార్మికులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. బొగ్గు బాయిల్లోనే కాదు.. బాయి బయట సమాజ సేవలో కూడా తమకు తామే సాటి అని నిరూపించుకుంటున్నారు. శ్రీరాంపూర్‌లోని గనుల వృత్తి శిక్షణ కేంద్రం(ఎంవీటీసీ)లో శిక్షణ పొందే ట్రైనీలు రక్తదానం ఆవశ్యకతను తెలుసుకుని రక్తదాతలుగా మారారు. ఇప్పటి వరకు 2,277 మందికి రక్తదానం చేసి పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.

గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసపత్రం


గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకుంటున్న జీఎం సంజీవరెడ్డి, వీటీసీ మేనేజర్ రామారావు

సింగరేణిలో ఉద్యోగంలో చేరిన యువ కార్మికులకు ముందుగా గనుల వృత్తి శిక్షణ కేంద్రంలో వీటీసీ మేనేజర్ రామారావు ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారు. జిల్లాలో తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉండడంతో మంచిర్యాల బ్లడ్ బ్యాంక్‌లో రక్తనిల్వలు దినదిన గండంగా మారాయి. విషయం తెలుసుకున్న అప్పటి శ్రీరాంపూర్ ఏరియా క్వాలిటీ మేనేజర్ రమేశ్ వీటీసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువచ్చారు. దీంతో వారంతా స్పందించి శిక్షణకు వచ్చే ట్రైనీ ఉద్యోగుల్లో రక్తదానంపై అవగాహన కల్పించారు. దీంతో 2019, డిసెంబర్ 19 నుంచి శిక్షణ తీసుకుంటున్న ప్రతీ బ్యాచ్ యువ కార్మికులు రక్తదానం చేస్తూ వస్తున్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేస్తుండగా ఇప్పటి వరకు ఎంవీటీసీలో 2,277 మంది రక్తదానం చేశారు. ఇందుకు 2022, జూన్ 14న రాష్ట్ర గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా జీఎం సంజీవరెడ్డి, వీటీసీ మేనేజర్ రామారావు వీటీసీ తరపున ప్రశంసాపత్రం అందుకున్నారు.

షిర్డీలో కూడా రక్తం ఇచ్చా



సాయిబాబాను దర్శించుకునేందుకు షిర్డీకి వెళ్లా. అక్కడ రక్త నిల్వలు తక్కువగా ఉన్నాయని, ఎవరైనా దాతలు రక్తదానం చేయాలని ఆశ్రమం నిర్వాహకులు సూచించారు. వెంటనే అక్కడి ఆస్పత్రికి వెళ్లి మొదటిసారి స్వచ్ఛందంగా రక్తం ఇచ్చా. సింగరేణితో కలిపి ఇప్పటి వరకు నాలుగు సార్లు రక్తదానం చేశా. నా స్నేహితులను కూడా రక్తదానం చేయాలని కోరుతున్నా. – దండు మధుసూదన్

49 సార్లు రక్తదానం చేశా



ఇప్పటి వరకు 49 సార్లు రక్తదానం చేశా. ఎంవీటీసీలో శిక్షణ పొందే ప్రతీ బ్యాచ్‌లో యువ కార్మికులకు రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నా. అంతేకాకుండా బయటకూడా 40 మంది స్నేహితులం టీంగా ఏర్పడి ఎవరికి రక్తం అవసరం ఉన్నా దానం చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ ఉంది. ఇప్పటి వరకు సుమారు 1800 మందికి రక్తదానం చేశాం. – డీ.రాజ్‌కుమార్, వీటీసీ శిక్షకుడు

శాంతిఖని గనిని సందర్శించిన ఐఎస్‌వో సభ్యులు


గనిని సందర్శించిన సభ్యులు

బెల్లంపల్లి: మందమర్రి ఏరియాలోని శాంతిఖని గనిని మంగళవారం ఏరియా ఇంటర్నల్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఐఎస్‌వో) సభ్యులు సందర్శించారు. ఏరియా రక్షణాధికారి ఎం.రవీందర్‌తో కూడిన సభ్యుల బృందం భూగర్భంలో దిగి పాత పని స్థలాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో కార్మికులు విధిగా రక్షణ సూత్రాలు పాటించాలన్నారు. వారి వెంట ఏరియా సర్వే అధికారి ఉజ్వల్ బంధోపాధ్యాయ్, ఏరియా ఇంజినీర్ నాగరాజు, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జి ముస్తఫా, గని అధికారులు ఉన్నారు.

రెండేళ్లకోసారి 'గుర్తింపు' ఎన్నికలు నిర్వహించాలి


మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు రెండేళ్లకోసారి నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు టీ.రాజారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్సార్పీ 3, 3ఏ గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యజమాన్యం, కొన్ని కార్మిక సంఘాలు నాలుగేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నాయని, దీనివలన కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు మిడివెల్లి శంకర్, కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కస్తూరి చంద్రశేఖర్, పిట్ సెక్రెటరీ అజయ్, నాయకులు గంగాధర చారి, తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి ఏడేళ్ల జైలు

రెబ్బెన(ఆసిఫాబాద్): మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడిపి సింగరేణి కార్మికుడి మృతికి కారణమైన ఒకరికి మంగళవారం ఏడు సంవత్సరాల ఆరునెలల జైలుశిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.రమేశ్ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై భూమేష్ తెలిపారు. 2019 అక్టోబర్ 6న సింగరేణి కార్మికుడు ఎర్గటి సాంబయ్య స్కూటీపై పులికుంటకు వెళ్తుండగా తక్కళ్లపల్లి బస్టాండ్ సమీపంలో ఎదురుగా వచ్చిన మినీ మహేంద్ర వ్యాన్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు గణేశ్ ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ అశోక్ కేసు దర్యాప్తు చేశారు. ప్రస్తుత సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేష్ 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావటంతో వ్యాన్ డ్రైవర్ గాండ్ల హనుమంతుకు జైలుశిక్ష, వాహనం యజమాని షేక్ చాంద్‌కు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

స్నాక్స్‌లో పురుగులు..

- ఎస్టీపీపీ క్యాంటీన్‌లో ఘటన
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్మికులు
- నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


శనిగల్లో వచ్చిన పురుగులు

జైపూర్(చెన్నూర్): సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు క్యాంటీన్‌లో నాసిరకమైన స్నాక్స్, క్వాలిటీలేని టిఫిన్స్, భోజనం అందించడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం క్యాంటీన్‌లో స్నాక్స్ (శనగ గింజలు)తింటున్న కార్మికులకు అందులో పురుగులు కనిపించడంతో నిర్వాహకులతో వాగ్వివాదానికి దిగారు. మండల కేంద్రంలోని 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ (ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్) ఆంధ్రాప్రాంతానికి చెందిన పవర్‌మేక్ కంపెనీ చేపడుతున్న విషయం తెలిసిందే. ఆయా విభాగాల్లో 1500 మంది పనిచేస్తున్నారు. కంపెనీలో ఉన్నత ఉద్యోగం చేస్తున్న నార్త్ రాష్ట్రానికి చెందిన ఉద్యోగికే క్యాంటీన్ అప్పగించారు. నాణ్యతతో కూడిన వంటకాలు అందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆహారపదార్థాల్లో వాడే నూనెతో పాటు పిండిపదార్థాలు ఏమాత్రం నాణ్యత లేకపోవడం, ఎక్కువగా నార్త్ సైడ్‌వాళ్లు తినే ఆహారపదార్థాలనే తయారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంటకాలను బయటి ధరలకే విక్రయిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్యాంటీన్ నిర్వహణ సక్రమంగా చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్టీపీపీ కార్మికులు కోరుతున్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి


మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించనున్న వేడుకల్లో పాల్గొని యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2008 డిసెంబర్ 4న మంచిర్యాలలో బ్లడ్ బ్యాంకును ఏర్పాటు చేశామన్నారు. 1,142 క్యాంపులను ఏర్పాటు చేసి 92,211 యూనిట్ల రక్తాన్ని సేకరించామన్నారు. 625 మందికి ప్లేట్‌లెట్లు, 2,628 మంది నుంచి ప్లాస్మాను సేకరించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రికి 22,415 యూనిట్లు, సబ్ సెంటర్లకు 4,095 యూనిట్లు, తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు 18,810 యూనిట్లను ఉచితంగా అందించామన్నారు. తలసేమియా సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని గర్భిణులకు అత్యవసరంగా రక్తాన్ని ఉచితంగా అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైస్ చైర్మన్ చందూరి మహేందర్, కోశాధికారి పడాల రవీందర్, కమిటీ సభ్యులు వీ.మధుసూదన్ రెడ్డి, కాసర్ల శ్రీనివాస్, కె.సత్యపాల్‌రెడ్డి, కిషన్, నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

సీడబ్ల్యూసీకి 'వార్ధా' డీపీఆర్

కౌటాల(సిర్పూర్): మండలంలోని వీర్దండి సమీపంలో వార్ధానదిపై నిర్మించనున్న బ్యారేజీపై ఢిల్లీలో కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) అనుమతికి బ్యారేజీ డీపీఆర్ నివేదికను అందజేసినట్లు కాగజ్‌నగర్ ఇరిగేషన్ ఈఈ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం ఢిల్లీలో సీడబ్ల్యూసీ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్లతో నిర్వహించిన సమావేశానికి చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ కేవీ రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచిర్యాల, కుమురంభీం జిల్లాల చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి నివేదికను ప్రదర్శించారు.

మైనార్టీలకు రాయితీ రుణాలెప్పుడో..!

- 100 యూనిట్లకు 2,709 దరఖాస్తులు


కోటపల్లిలో ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

కోటపల్లి(చెన్నూర్): బీసీలకు రుణాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఐదేళ్లయినా ఆ ఊసే ఎత్తడం లేదు. తాజాగా మైనార్టీ యువతకు స్వయం ఉపాధి రుణాలు ఇస్తామని ప్రకటించి ఆరు నెలలైనా అడుగు ముందుకు పడడం లేదు. జిల్లాకు 100 యూనిట్లు మంజూరు చేస్తున్నట్లు గతేడాది ప్రకటించారు. దరఖాస్తులను గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది జనవరి 5వ వరకు స్వీకరించారు. ఆ తర్వాత వెంటనే ప్రక్రియ కొనసాగాల్సి ఉండగా వివిధ కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. ఫిబ్రవరిలో కొన్ని చోట్ల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు పూర్తి చేశారు. కానీ రుణాలు మాత్రం మంజూరు చేయలేదు.

దరఖాస్తుల వెల్లువ..

మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మైనార్టీ యువత నుంచి స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. 100 యూనిట్లను రెండుగా విభజించారు. మొదటి విభాగం 80 శాతం రాయితీ రెండో విభాగం యూనిట్లను 70 శాతం రాయితీపై ఇవ్వాలని ప్రభుత్వం పేర్కొంది. నిబంధనల ప్రకారం వచ్చిన దరఖాస్తులను అధికారులు ముందుగా పరిశీలన పూర్తి చేశారు. ఆయా ఎంపీడీవో కార్యాలయాల్లో అన్ని రకాల అర్హత కలిగిన వారిని గుర్తించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలాల్లో ఇంటర్వ్యూలు పూర్తయిన తర్వాత జాబితాను మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులకు పంపించాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటి వరకు కార్యాలయానికి ఆ లబ్ధిదారుల ఎంపిక రిపోర్టు అందకపోవడంతో లబ్ధిదారుల ఎంపికలో ఆలస్యం జరుగుతోంది. ఎంపీడీవో కార్యాలయాలకు ఎన్నిసార్లు జిల్లా అధికారులు విన్నవించినా ఇప్పటి వరకు స్పందన లేకపోవడంతో మైనార్టీ రుణాల కోసం వేచి చూసే యువతకు నిరాశే మిగులుతోంది. ఇంటర్వ్యూ ప్రక్రియ ముగిసి మూడు నెలలు కావస్తున్నా సంబంధిత దరఖాస్తులను అధికారులకు ఇప్పటికీ జిల్లా కేంద్రానికి పంపడంతో నిర్లక్ష్యంతో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఫిబ్రవరిలో కొన్ని మండలాల్లో మాత్రమే ఇంటర్వ్యూలు నిర్వహించారు. భీమారం మినహా ఇప్పటి వరకు ఏ ఒక్క మండలం నుంచి దరఖాస్తులు జిల్లా కేంద్రానికి అందలేదు. ఎన్నిసార్లు జిల్లా ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందితో అధికారులకు నోటీసులు పంపించినా మండలాల నుంచి కనీస స్పందన లేకపోవడం గమనార్హం.

త్వరలోనే నిధుల మంజూరు

మైనార్టీ రుణాల కోసం మండలాల నుంచి జాబితా రాగానే రాష్ట్రస్థాయి అధికారులకు పంపిస్తాం. భీమారం మినహా ఇంకా చాలా వరకు మండలాల నుంచి దరఖాస్తులు రావాల్సి ఉంది. దరఖాస్తు దారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలోనే రుణాలు మంజూరు అవుతాయి. – రాజేశ్వరి, మైనార్టీ సంక్షేమాధికారి, మంచిర్యాల

లబ్ధిదారులు ఎక్కువ... యూనిట్లు తక్కువ

మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యువతకు స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన 100 యూనిట్లు కాగా దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాకు మైనార్టీ రుణాల్లో జనాభా ప్రకారంగా విడుదల చేస్తే బాగుంటుందని యువత కోరుతున్నారు.

'అధికారులపై కేసు నమోదు చేయాలి'



ఢిల్లీలో మాట్లాడుతున్న శేజల్

బెల్లంపల్లి: తనను లైంగికంగా వేధింపులకు గురిచేసిన బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో పాటు ఇతర పోలీసు అధికారులపై కేసు నమోదు చేయాలని ఆరిజిన్ డెయిరీ భాగస్వామి బోడపాటి శేజల్ డిమాండ్ చేశారు. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తనకు న్యాయం చేస్తారని ఎదురు చూస్తున్నట్లు తెలిపారు.

ఆదివాసీల అభివృద్ధికి చర్యలు


రాష్ట్రపతి ముర్ముతో ఉమ్మడి జిల్లా ఆదివాసీలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపట్టనున్నామని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 16 రాష్ట్రాలకు చెందిన గిరిజన ప్రతినిధులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడినట్లు ఉట్నూర్ ఐటీడీఏ ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుంచి రాష్ట్రపతితో భేటీకి వెళ్లిన పీవీటీజీలు ముందుగా పార్లమెంట్ సెంట్రల్ హాల్ సందర్శించిన అనంతరం రాష్ట్రపతితో భేటీ అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆదివాసీ సాంస్కృతిక నృత్యాలు, ఆటపాటలు వీక్షించారు. అలాగే ఆదివాసీల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై వివరించినట్లు వారు తెలిపారు.